# ముసురు తొలిగింది

— టి.ఎస్. హరగోపాల్



బయట ముసురు తగ్గినట్టుగా లేదు. ఇంకా వుండుండి వర్షం కురుస్తూనే వుంది. మూడు రోజులైనా కరెంటు రాలేదు. కిటికీ సందులలోనుంచి చల్లని గాలి వీస్తోంది. బయటి వాతావరణం లాగానే నా మనసు అల్లకల్లోలంగా వుంది. సిగరెట్లు ఆపకుండా తాగుతున్నా. కొవ్వొత్తి వెలుగులో గదంతా విండిన సిగరెట్టు పొగ రింగులు, రింగులుగా కన్పడుతోంది. వుండుండి, అసహనంగా సోఫాలో నుంచి లేచి గదిలో పచార్లు చేస్తున్నా.

"కాఫీ కావి ఇవ్వమంటారా", నెమ్మదిగా అడిగింది సరోజ, అవతల గదిలో గుమ్మంలో నిలబడి.

ఆమె వైపు చూసి, ఒక్క క్షణం ఆగి, "అక్కర్లేదు, నువ్వు పడుకో" అన్నా.


"చాలా టైమయింది"

"........"

నా మౌనానికి ఆమె లోపలికి వెళ్ళిపోయింది.

కళ్ళు మూసుకొని సోఫాలో కూర్చున్నాను. జీవితంలో ఒంటరితనం ఫీలవుతున్నా. ఏదో వెలితి, ఏదో నిస్పృహాయిత. అంతా శూన్యంగా వుంది.

తలుపులు గట్టిగా కొడ్తున్న శబ్దం అయింది. ఉలిక్కిపడి లేచా.



గాలెక్కువైందన్నమాట. 'ఆంధ్ర దేశాన్ని ముంచింది చాలదు. ఇంకా మిగిలింది కూడా కొట్టుకుపోవాల' అనుకున్నా.

"రవీ, రేయ్ రవీ... రవీ" తలుపు చప్పుడుతో పాటు, నన్ను ఎవరో పిలుస్తున్నట్టుగా వుంది.

"ఎవరా" అనుకుంటూ, 'ఎవరూ' అని తలుపు పక్కన కిటికీలో నుంచి అడిగా.

"నేమరా రమేష్‌ని, తలుపుతియ్"

ఆశ్చర్యంగా తలుపు తీశా, ఎదురుగా రమేష్.

"ఏమిటిరా, నిద్రపోయావా? ఇంత సేపటి నుంచి తలుపు కొడ్తున్నా?"

"గాలికి తలుపు కొట్టుకుందను కున్నా... ఏమిటి, ఇక్కడి నుంచి ఇంత అర్ధరాత్రి?"

"త్రివేండ్రం నుంచి మద్రాసు వచ్చా. అటు నుంచి మీ వూరు విశాఖపట్నం వెళ్దామని బయల్దేరాం. తుని తర్వాత రైలు పట్టాలు కొట్టుకుపోయి, వైజాగ్‌కు ట్రైన్ వెళ్ళడం లేదన్నారు. సరే, ఈ రాత్రి వేళ వైజాగ్ ఎలా వెళ్ళాలో తెలీక, నువ్వు గుర్తువచ్చి, ఇక్కడ తలదాచుకుందామని వచ్చా."

"ఎంత మాటరా! ఈ కారణంగానైనా వచ్చావ్... డ్రస్ మార్చుకో ముందు."

మా మాటలకు సరోజ లోపలి నుంచి బయటకు వచ్చింది.

రమేష్ ఆమెను చూసి, ఎవవరి ఆశ్చర్య పోయినట్టుగా ముఖం పెట్టాడు.

నేను ఇబ్బందిగా, 'సరోజ... అని' అంటుండగా, "నీకు పెళ్ళి కాలేదుగా" అన్నాడు రమేష్.

"లేదు..."

ఏమనుకున్నాడో, వూరుకున్నాడు రమేష్.

బాత్‌రూంలోకి వెళ్ళి, స్నానం చేసి డ్రస్ మార్చుకుని వచ్చాడు.

సరోజ మా ఇద్దరికి కాఫీ కలిపి ఇచ్చింది.

కాఫీ తాగుతూ, కబుర్లు మొదలెట్టాం.

"ప్రతి సంవత్సరం మే నెల, నవంబర్ నెల వచ్చేసరికి, ఆంధ్రాలో ఎక్కడ తుఫాను వస్తుందో, ఏం ప్రళయం తెస్తుందోనని ప్రాణాలు ఉగ్గపట్టుకు కూర్చుంటున్నాం. ఎక్కడో తేలవలసిన తుఫాను ఇక్కడ ముంచేసింది. మూడు రోజుల నుంచి నీళ్ళు, పాలు, కరెంటు లేదు..." ఏదో సోది చెప్పు కున్నాం.

"మరి, ఈ వాతావరణంలో ఉత్త కాఫీ ఏమిట్రా?"

"ఫారిన్ స్కాచ్ వుంది తియ్యమంటావా" అన్నా.

"తియ్యనా అని అడుగుతావేమిటిరా?... పరవాలేదా?" సరోజని దృష్టిలో వుంచుకుని రమేష్ సందేహం వెలిబుచ్చాడు.

"ఫర్వాలేదు"

అల్మెరాలోంచి బాటిల్ తీశాం. ఫ్రిజ్‌లోంచి నాలుగు సోడా తీశాం. జీడి పప్పు వుంది.

"శభాష్ వాతావరణానికి సరిపడ్డ అరేంజిమెంట్లు" రమేష్‌లో హుషారు వచ్చింది.

నాకు కూడా వాతావరణం మారినందుకు కొద్దిగా ఊరటగా వుంది.

రమేష్ గ్లాసులో డ్రింక్‌ని సిప్ చేస్తూ "ఇంకా ఏమిటీ కబుర్లు" అన్నాడు.

మౌనంగా వురుకున్నా.

"నళిని ఎక్కడా?"

"హైదరాబాద్‌లో ఆయన ఏదో బ్యాంకులో"

"సావిత్రి, కళ్యాణి, అనుపమ..."

"వాళ్ళంతా మన గత చరిత్రపు గుర్తులు."

"మరి, ఈ వర్తమానం...?

నాకు తెలుసు, సరోజని ఉద్దేశించి రమేష్ అన్నాడని.

కొద్దిసేపాగి, "ఏమీ కాదు, విధి కలిపిన ఒక పాత్ర అంతే" అన్నా.

రమేష్ ఏమనుకున్నాడో, మాట్లాడలేదు.

ఈ నిశ్శబ్దాన్ని భరించలేక పోతున్నా. మనసంతా చాలా ఉద్వేగంగా వుంది.

"సరోజ ఎవరని అడగవేం రమేష్?"

"ఏం అడగను, చెప్పే విషయమైతే నువ్వే చెప్తావుగా."

"నా ఫ్రెండ్‌వి, నీకు గాక ఇంకెవరికి చెప్తా!"

"ఏప్రిల్‌లో ఒక రాత్రి ఆఫీసు పని మీద హైదరాబాద్‌కి బస్‌లో బయల్దేరా. టిక్కెట్ రిజర్వ్ చేసుకున్నా. సరిగా పది గంటలకి బస్‌స్టాండ్‌కి వచ్చి కిటికీ ప్రక్కనే నా సీటులో కూర్చున్నా. నా సీటు వెనుక నుంచి రెండు వరుస. తలనొప్పిగా వుండడం వల్ల ఆస్ప్రో వేసుకుని, అంతకుముందే టీ త్రాగా.

టిక్కెట్ చెక్కింగ్ అయి, బస్సు బయల్దేరింది. వూరు దాటింది బస్సు. పౌర్ణమి అనుకుంటా వెన్నెల పిండార బోసినట్టుగా వుంది. చల్లని గాలి వీస్తోంది. కొద్దిగా కునుకుబట్ట

బోతోంది. బస్సులో గుస, గుసలు వినబడ్డాయి. అప్పుడు చూశా, నాకు అవతల సీట్లలో ఒక జంట.

మరి, ఏం చలివేస్తోందో, పల్చని దుప్పటి కప్పుకున్నారా జంట. ఆ అమ్మాయి అతని ఒళ్ళో తల పెట్టుకు పడుకుంది. అతను ఆమె చెవిలో ఏదో గుస, గుసలాడుతున్నాడు. "ఛీ, ఛీ" అంటూనే, ఆమె అతనిలో ఇంకా ఒదిగిపోతోంది.

నేను నవ్వుకున్నా.

చివరి సీట్లేమో, ఎమర్జన్సీ తలుపు దగ్గర రెడ్‌లైట్ ఆ జంట మీద పడ్తోంది.

నిద్ర పట్టకపోవడం వల్ల, అసంకల్పితంగా నేనప్పుడప్పుడు అటు చూశా.

కాసేపటికి, అతను ఆమె ఒడిలో తలపెట్టుకున్నాడు. ఆమె అతని జుట్టుని ముఖం మీదకు లాగి, అల్లరి చేస్తోంది.

కాసేపటికి నేనే గిల్టీ ఫీలయి, కళ్ళు మూసుకుని నిద్రపోయా. తల నొప్పిగా వుందేమో, చల్లగాలికి నిద్ర పట్టేసింది.

సూర్యాపేట వచ్చింది. ఒక్కమారుగా తలనొప్పి తగ్గేసరికి, కడుపంతా దేవినట్టయి, రెండు అరటి పళ్ళు తిని టీ త్రాగా.

అదుగో, అప్పుడు చూశా ఆ జంటని స్పష్టంగా. కొత్తగా పెళ్లయిందనుకుంటా.

ఆ అమ్మాయి చాలా అందంగా వుంది. చాలా కాలం తర్వాత ఓ బ్యూటీని చూశాననుకున్నా.

సూర్యాపేటలో బస్సు బయల్దేరింది. నాకు పూర్తిగా నిద్ర తేలిపోయింది. ఆ జంట హాయిగా నిద్ర పోతున్నారు. వేసవి గాలేమో బస్సులో అంతా నిద్ర పోతున్నారు. నిశ్శబ్దాన్ని చీల్చుకుంటూ బస్సు వెళ్తోంది.

అటూ, ఇటూ దూరంగా చిన్న చిన్న కొండలు, విశాలమైన ప్రదేశం. దగ్గరలోఎక్కడా లేవ నుకుంటా, నిర్మానుష్యంగా వుంది. ముందు, వెనుక కూడా ఏమీ వాహనాలు లేవు.

కొద్ది దూరం వెళ్లిన తర్వాత ఎవరో ఒకరు లేచి డ్రైవరు దగ్గరకు వెళ్లాడు. మెళుకువగా వున్నాగదా చూశా నేను. 'నేచుర్స్ కాల్' కోసం డ్రైవరును ఆపమని అడగడానికి వెళ్లాడనుకున్నా.

సడెన్‌గా యింకో ముగ్గురు లేచారు. ముఖానికి నల్లని తొడుగు. చేతులకు గ్లవ్స్. చేతుల్లో తళ తళ మెరుస్తూ కత్తులు.

నా కొక్కసారిగా గుండె ఆగినంత పని అయింది, బందిపోటు దొంగలని గ్రహించేసరికి. అంత కలవరపాటు లోనూ నేను జేబులో పర్సులో నుంచి రెండు వేలల్లో ఎక్కువ నోట్లని చొక్కా లోపలికి తోసివేశా.

మెళుకువగా వున్నానేమో, అందులో ఒకడు సరాసరి నా దగ్గరకు వచ్చి 'తియ్, పర్స్ తియ్' అన్నాడు. పర్సు ఇచ్చేశా. అందులో మూడు వందలు,చిల్లర తీసుకుని పర్సు నా మీదకు విసిరాడు.

"నీ సూట్‌కేస్ ఏది, తియ్" అన్నాడు.

"అదిగో పైన వుంది. అందులో బట్టలే"నని, సీటులో నుంచి లేచా, బ్రీఫ్‌కేస్ తీయడాన్కి.

ఈలోగా ఆ ముగ్గురు దొంగలూ బస్సులో అందరి నుంచి నగలు, డబ్బు దోచేసుకున్నారు. బస్సు నెమ్మదిగా వెళ్తోంది.

ఒకావిడ మెడ నిండా గొలుసులు, చేతినిండా గాజులు. "నాయనా యీ ఒక్కటీ వదిలెయ్" అంటోంది.

"తియ్, లేకపోతే పొడిచేస్తా, తియ్" అరుస్తున్నాడు, అందులో ఒకడు.

కాసేపటికి వెనక నుంచి లారీ వచ్చింది. బస్సు నెమ్మదిగా వెళ్ళడం చూసి బస్సు ప్రక్కకు వచ్చి, "ఏమైంది బస్సుకి" అని డ్రైవర్ నడిగాడు.

డ్రైవరు మెడ మీద కత్తి పెట్టి "ఏం లేదని చెప్పు, వాడ్ని పొమ్మను" అన్నాడు ఓ బందిపోటు దొంగ. లారీ వాడు వెళ్లిపోయాడు. చిక్కిన ఒక్క అవకాశం తప్పిపోయింది.

బస్సులోని అందరి దగ్గర దోపిడీ అయిపోయింది. ఆ కొత్త జంటని కూడా మంగళసూత్రాలతో సహా దోచేశారు.

"ఇంకోమారు చూడు.. కాళ్ల కింద, సీట్ల కింద తోసేస్తారు" అందులో ఒకడు అరిచాడు.

"అలాగే చూస్తున్నా" అంటూ మాకు దగ్గరలో వున్నవాడు, చిన్న బేటరీ లైట్‌తో మళ్లా సీట్ల క్రింద యింకా నగలేమైనా ఇవ్వకుండా దాచారాని చూస్తున్నాడు.

ఆ జంట మీద బేటరీ లైట్ వేశాడు.

ఒక్కమారుగా, "రేయ్, యిదెవతో గుంట బాగుందిరా" అని అరిచాడు.

మా అందరి గుండెలు ఆగిపోయాయి.

"వద్దు, వద్దు, దిగిపోదాం" ఆ నల్గురిలో ఒకడు అరిచాడు.

"లేదురా, బాగుంది గుంట. చాలా కాలమైంది. కుతిగా వుంది. బస్సుని పక్కకి పోనివ్వమను."

ఆ అమ్మాయి భర్తకి కోపం వచ్చింది.

"ఏయ్, మర్యాదగా దిగిపోండి. పిచ్చి పిచ్చి వేషాలు వేయకండి" అరిచాడు.

"ఏమిట్రా కూస్తున్నావ్, కూర్చో" అని ఒక్క తోపు తోసి "బస్సుని డొంక దారిలోకి పోనియ్" అని అరిచాడు.

బస్సులో టెన్షన్ పెరిగిపోయింది. "బాబూ, వద్దు పాపం.. మీ డబ్బు, నగలు పట్టుకుపోండి... ఆ అమ్మాయి జోలికి వెళ్లకండి..." అందరూ ప్రాధేయపడ్తున్నారు.

డ్రైవరు దారి తప్పించడానికి ఒప్పుకోలేదని, అతని మెడపై కత్తిగాటు పెట్టి, "మెడ తెగిపోతుంది" అని అరిచాడు అక్కడున్నవాడు. గత్యంతరం లేక డ్రైవర్ ప్రక్కన డొంక దారి పట్టించాడు.

ఆ అమ్మాయిని ఒకడు సీటు లోంచి లాగి ముందుకు లాక్కెళ్తున్నాడు. ఇద్దరు, "ఎవరు కదిలినా పొడిచేస్తాం" అని హెచ్చరిస్తున్నారు. ఆమె భర్త ఆమెను వెనక్కి లాగుతుంటే, అతన్ని బలంగా వెనక్కి తోసేశారు.

బస్సు దూరంగా మైదానంలో ఆగింది. ఎక్కడా అరిచి గీపెట్టినా వినే నాథుడే లేడు. ఆ అమ్మాయిని కిందకు లాగారు. పెనుగులాడి, పరుగు తీస్తే వెంటపడి చీర దొరక పుచ్చుకున్నారు.

అందరం దిగాం.

ఆ అమ్మాయి వంటి మీద చీర లేదు. రెండు చేతులు అడ్డం పెట్టుకుని దీనంగా ఏడుస్తోంది. "వద్దు..వద్దు...ఏమండీ....
ఏమండీ...బాబూ నన్ను రక్షించండి.... దేముడా! నాకు సాయం చెయ్..."

ఆ నల్గురు వికటాట్టహాసాలు.

ఆ అమ్మాయి రోదన.

ఏభై మంది నిస్సహాయత.

ఒకడు ఆ అమ్మాయిని క్రిందకు తోసేశాడు. మిగిలిన ముగ్గురూ కత్తులతో వీరవిహారం చేస్తున్నారు.

"కానియ్..." అరుస్తున్నారు రాక్షసంగా.

ఆ అమ్మాయి పెనుగులాడి ఓడిపోయింది. జాకెట్టు చిరిగింది. లంగా స్థానభ్రంశం పొందింది.

ముగ్గురూ తన్మయంతో చూస్తున్నారు. నిశ్శబ్దం అలుముకుంది.

ఆ దృశ్యాన్ని చూసేసరికి నాలో రక్తం సలసల మరిగింది. కళ్లు చింత నిప్పులయ్యాయి. ఆ వెన్నెలలో

నాకొక్కటే కనపడింది. వాడి పక్కన పడున్న కత్తి.

ఒక్క ఉదుటున ఆ కత్తి తీసుకుని వాడి కడుపులో పొడిచా. 'అమ్మా' అని దిక్కులు పిక్కటిల్లేలా అరిచాడు. కత్తిని వాడి కడుపులో తిప్పి బయటకు లాగా.

రక్తం... అంతా రక్తం... వాడుపక్కకు పడిపోయాడు.

ఆ షాకు నుంచి తేరుకున్న మిగిలిన ముగ్గురూ 'రేప్' అంటూ నా మీదకు రాబోయారు. రక్తసిక్తమైన ఆ కత్తితో "చంపేస్తా దగ్గరకు వస్తే. కత్తులు పడేయండి" అని అరిచా. ఊహించని పరిణామానికి భయపడి, ఆ ముగ్గురూ కత్తులు పడేసి, పారిపోవడం మొదలు పెట్టారు. జనాలు వాళ్లవెంట పడ్డారు కానీ, పట్టుకోలేక పోయారు.

ఆ అమ్మాయికి మిగిలిన ఆడవాళ్ళు చేయూతనిచ్చి, బస్సులోకి ఎక్కించారు. భర్త ఆమెకు చీరకప్పి, దగ్గరకు తీసుకున్నాడు. నేను షాకునుంచి తేరుకోలేదు. నన్ను కూడా నెమ్మదిగా బస్సెక్కించారు. ఆ దెబ్బతిన్న బందిపోటుని కూడా బస్సులోకి ఎక్కించారు.

బస్సుని దగ్గరలో వున్న పోలీసు స్టేషన్‌కి తీసుకుని వెళ్లి కేసు నమోదు చేశారు. అప్పటికే రక్తమంతా పోయిన ఆ బందిపోటు దొంగ మరణ వాఙ్మూలంలో మిగిలిన ముఠా వివరాలిచ్చి, ఆ అమ్మాయికి నమస్కారం చేసి, కన్ను మూశాడు.

అతనిచ్చిన వివరాల ఆధారంగా, ఆ బందిపోటు ముఠాని పట్టుకున్నారు.

"శభాష్, ఒక హీరోచిత కార్యక్రమం చేశావన్న మాట" రమేష్ మెచ్చుకోలుగా అన్నాడు.

"అదుగో ఆ హీరోచిత కార్యమే నా జీవితాన్ని ఓ మలుపు తిప్పింది."

"ఇదొక పెద్ద సంఘటనగా అన్ని పేపర్లలోనూ ఆ అమ్మాయి ఫొటో, నా ఫొటో వివరాలతో పడింది. ఎంతో కాలంగా దారి దోపిడీలు చేసిన ముఠాని పట్టి ఇవ్వడమే గాక, ఓ స్త్రీ మానాన్ని కాపాడి నందుకు రాష్ట్ర ప్రభుత్వం నన్ను అభినందించింది."


"గుడ్ చాలా సంతోషంగా వుందిరా"

ఆ అమ్మాయి ఎంతో కాలం ఆనందంగా లేదు. అత్తవారింట్లో ఆ అమ్మాయి ఏదో తప్పచేసి నట్లు, ఆ అమ్మాయి ఉనికివల్ల వాళ్ల గౌరవ, మర్యాదలు మంట గలిసినట్టు ప్రవర్తించడం మొదలు పెట్టారు. ఆమె భర్త కూడా మౌనంగా వూరుకున్నాడు.

"దారుణంగా వుందే"

"దారుణమే. సీతమ్మవారిని అగ్నిప్రవేశం చేయించిన రామచంద్రుడు పుట్టిన ఈ దేశంలో, నిండు సభలో ద్రౌపదీ దేవి వలువలు వలుస్తూంటే, నీతి పాఠాలు వల్లించిన ధర్మరాజు పుట్టిన ఈ దేశంలో దారుణాలు గాక ఏ మంచిని ఆశించగలవు?.. అసలు, అంత బలాత్కారం జరగడానికి ఆ అమ్మాయే కారణమన్నారు. ఆ అమ్మాయి గట్టిగా నిరోధిస్తే, ఆ దుండగుడేం చేయగలడంటుంది ఆ అత్త. ప్రపంచంలో అలాంటి ఆడదుంటుందని నేను ఊహించలేదు. ఇవేమీ తెలియని నేను ఓ రోజు వాళ్లింటికి వెళ్లా. ఎంతో సాదరంగా ఆహ్వానిస్తారనుకున్న నాకు, లోపలినుంచి "వీడొకడు, రంకు మొగుడులా" అంటూ ఆ అమ్మాయి అత్తగారి అరుపుకి స్థాణువునయి పోయా. ఆమె భర్త కూడా చాలా నిర్లిప్తంగా వున్నాడు. ఆ రోజు బస్సులో అంత ప్రేమగా వున్న ఆ మనిషేనా ఇతనని పించింది.

"ఏమండీ, ఆవిడ తప్పేముందని... మీరు చదువుకున్న




వారు, మీరు కూడా ఆవిడని ఇలా నిర్లక్ష్యం చేయడం బాగుండలేదు..."

నా మాటలకు పెనుగాలిలా అడ్డం వచ్చింది అతని తల్లి "చాల్చాల్లేవయ్యా... అంత రెడీ, గజదొంగ ముట్టుకున్న శరీరాన్ని ముట్టుకోవలసిన ఖర్మ నా కొడుకుకేం పట్టలేదు. అంత సానుభూతి వున్న వాడవైతే, నువ్వే వుంచుకోదాన్ని... పోవే సరోజా, పో... ఆయనతోనే పో... రక్షించాడుగా, ఏం చూసి రక్షించాడో..."

"ఛీ, ఛీ" అనుకుంటూ నేను వచ్చేశా.

ఆ అమ్మాయికి అత్తవారింట్లో వేధిపు లెక్కువయినాయి. భర్త నిరాదరణని భరించలేని ఆమె పుట్టింటికి వెళ్తే "ఎలాగోలా సర్దుకుపో" అని ఆమె తల్లి దండ్రులు వెనక్కి పంపేశారు.

ఎవరికీ అక్కరలేని ఆ అమ్మాయి నా దగ్గరకు వచ్చింది.

"కన్నవారికి, అత్తవారికి కాకుండా పోయా, చేయని తప్పుకి శిక్షని అనుభవిస్తున్నా. చచ్చిపోదామనుకున్నా, అకారణంగా నన్ను హింసపెట్టిన ఆ దేముడి దగ్గరకు కూడా వెళ్లదలచుకోలా. ఒక ఉద్యోగం చూసుకుని, నా కాళ్ల మీద నేను నిలబడే వరకు ఈ దేముడి దగ్గర ఇంత చోటివ్వమని ప్రాధేయపడ్తున్నా" సరోజ దీనంగా అడిగింది.

"రమేష్, నన్ను నేను నిగ్రహించుకోలేక పోతున్నారా. అంత అందమైన అమ్మాయికి ఈ దీనావస్థ ఎందుకు కలగాలి? జీవితమంతా తోడు వుంటానని పెళ్లినాడు ప్రమాణం చేసిన ఆ భర్త ఇంత క్రూరంగా సరోజని ఎందుకు వదిలివేయాలి? తల్లి తర్వాత తల్లి వంటి ఆ అత్త అంత హీనంగా ఎందుకు ప్రవర్తించాలి? మనందరం ఈ సమాజంలో జరిగే దుష్కృత్యాలకు సాక్షీభూతులుగా నిలబడడమేనా?"

"లేదు, లేదు... ఈ భూమి మీద పుట్టినందుకు, ఈ సమాజంలో భాగమైనందుకు నా వంతు కర్తవ్యం నేను నిర్వహిస్తా."

"ఏం చేస్తావ్?"

"సరోజని పెళ్లి చేసుకుంటా."

నా మనస్సు ఒక్కసారిగా తేలిక పడింది.

బయట ముసురు తొలగింది. ఆకాశంలో మబ్బులు విచ్చుకున్నాయి. ఉదయభానుని కిరణాలు నలు దిక్కులా పరచు కుంటున్నాయి.

*